1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 162 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 30 ఏప్రిల్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 162 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 30 April 2025 PAGES : 8 PRICE : 3/-


## పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడితే అక్కడికే వెళ్లిపోండి

- పహల్గాం అమరులకు నివాళులర్పించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- మధుసూదన్‌రావు ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించిన పవన్
- మధుసూదనరావు కుటుంబానికి జనసేన రూ.50లక్షల ఆర్థిక సాయం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 29)**

మత ప్రాతిపదికన 26 మందిని చంపినా పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడటం సరికాదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అలా మాట్లాడాలనుకుంటే పాకిస్థాన్‌కే వెళ్లిపోవాలని అన్నారు. మత ప్రాతిపదికన చంపడం సరికాదని అన్నారు. ఇటీవల జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో హాలులో జనసేన పార్టీ తరపున నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఉగ్రవాదం, హింసపై అందరూ ఒకేలా స్పందించాలని అన్నారు. కశ్మీర్ భారత్‌లో భాగమని, ఇలాంటి విషయాలపై ఓట్లు, సీట్ల కోసం మాట్లాడకూడదని చెప్పారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదన్‌రావు కుటుంబానికి పార్టీ తరపున రూ.50 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఉగ్రఘటనలో జనసేన ఓ కార్యకర్తను కోల్పోయిందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. సత్యం మాట్లాడాలంటే చాలా ధైర్యం కావాలని చెప్పారు. చనిపోయిన మధుసూదన్‌రావు ఎవరికి హాని చేశారని కుటుంబాన్ని తీసుకొని కశ్మీర్‌కు వెళ్తే చంపేశారని పవన్ అన్నారు.

**గుర్తింపుకార్డు అడిగి కాల్చి చంపారు:**

కశ్మీర్ మనది కాబట్టే అక్కడికి వెళ్లామని అలానే ఉగ్రవాదులు గుర్తింపుకార్డు అడిగి కాల్చి చంపారని మధు భార్య చెప్పారని పవన్ తెలిపారు. హిందువులకు ఉన్న దేశం ఇదొక్కటేనని పవన్ తెలిపారు. ఇక్కడ కూడా ఉండొద్దంటే ఎక్కడికి పోవాలని అన్నారు. యుద్ధ పరిస్థితులు వచ్చినా సిద్ధంగా ఉండాలని మత కలహాలు సృష్టించే వారిపై అప్రమత్తంగా మిగతా 2లో







## పాక్ ఎయిర్‌లైన్లకు భారత గగనతలం మూసివేత..?




**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 29)**

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తమపై ఆంక్షలు విధించిందనే అక్కసుతో భారత్‌పై పాకిస్థాన్ విషం చిమ్మింది. తమ గగనతలంపై మన దేశ విమానాల రాకపోకలపై నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీ కూడా దీనిపై ప్రతీకార చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాక్ విమానయాన సంస్థలకు మన గగనతలాన్ని మూసివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇక, పాకిస్థానీ నౌకలు కూడా భారత పోర్టుల్లోకి రాకుండా నిషేధం విధించనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. "ప్రస్తుతం ఈ ప్రతిపాదన పరిశీలన దశలో ఉంది. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు" అని కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓ అధికారి వెల్లడించినట్లు సమాచారం. ఒకవేళ దీనిపై భారత్ నిర్ణయం తీసుకుంటే.. అది పాక్ ఎయిర్‌లైన్లపై పెను ప్రభావం చూపించే అవకాశం ఉంది. పాక్ విమానాలు కౌలాలంపూర్ సహా మలేసియాలోని ఇతర నగరాలు, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే మన గగనతలాన్ని దాటాల్సిందే. ఇప్పుడు భారత్ నిషేధం విధిస్తే.. దక్షిణాసియా ప్రాంతాలకు వెళ్లేందుకు చైనా లేదా శ్రీలంక మీదుగా విమానాలను మళ్లించాల్సి ఉంటుంది. అప్పుడు ప్రయాణసమయం పెరగడంతో పాటు నిర్వహణ పైనా అదనపు భారం పడుతుంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన పాక్ ఎయిర్‌లైన్లకు ఇది మరింత శరాఘాతంగా మారనుంది. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల మన విమానాలకు పాక్ తమ గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. దీంతో భారత ఎయిర్‌లైన్లు కూడా ప్రత్యామ్నాయ మార్గాల్లో విమానాలు నడుపుతున్నాయి. అయితే, ఈ నిర్ణయంతో ఆర్థికంగా మనకంటే పాక్‌కే ఎక్కువ నష్టం అని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటివరకు భారత్ నుంచి పాక్ గగనతలం మీదుగా వారానికి 800లకు పైగా అంతర్జాతీయ విమానాలు రాకపోకలు సాగించేవి. ఇందుకోసం ఓవర్‌ఫ్లైట్ ఫీజు మిగతా 2లో

## పద్మభూషణ్ అవార్డును అందుకోవడంపై బాలకృష్ణ స్పందన

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పద్మభూషణ్ అందుకున్న బాలకృష్ణ
సరైన సమయానికే పద్మభూషణ్ పురస్కారం వచ్చిందన్న బాలయ్య
అభిమానులకు, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 29)**

ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ పురస్కారాన్ని స్వీకరించారు. దేశ రాజధాని ఢిల్లీలో నిన్న జరిగిన పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఆయన ఈ గౌరవాన్ని అందుకున్నారు. పంచెకట్టులో సంప్రదాయబద్ధంగా హాజరైన బాలకృష్ణ, అవార్డు స్వీకరణ అనంతరం మీడియాతో తన సంతోషాన్ని పంచుకున్నారు. ఈ పురస్కారం అందుకోవడం పట్ల బాలకృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. తన అభిమానులకు, భారత ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ అవార్డు ఎప్పుడో రావాల్సిందని కొందరు అభిమానులు అభిప్రాయపడుతుంటారని, అయితే తనకు సరైన సమయంలోనే పద్మభూషణ్ వచ్చిందని తాను భావిస్తున్నట్లు బాలకృష్ణ పేర్కొన్నారు. "వరుసగా నేను నటించిన నాలుగు సినిమాలు ఘన విజయం సాధించడం, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభించి 15 సంవత్సరాలు పూర్తి కావడం, ముఖ్యంగా నేను సినీ రంగ ప్రవేశం చేసి 50 ఏళ్లు పూర్తయిన ఈ తరుణంలో ఈ పురస్కారం రావడం నాకు ఎంతో ప్రత్యేకం" అని ఆయన వివరించారు.

## నేడు 'స్విచ్ఛాఫ్ లైట్స్'కు పిలుపునిచ్చిన అసదుద్దీన్ ఒవైసీ

వక్ఫ్ సవరణ చట్టంను వ్యతిరేకిస్తూ నిరసన
రాత్రి తొమ్మిది గంటలకు 15 నిమిషాల పాటు లైట్లు ఆఫ్ చేయాలని పిలుపు
వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఏఐఎంపీఎల్‌బీ నిరసన కార్యక్రమాలు



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 29)**

వక్ఫ్ సవరణ చట్టం-2025ని నిరసిస్తూ ఈ నెల 30వ తేదీన దేశవ్యాప్తంగా 'లైట్స్ ఆఫ్'కు మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పిలుపునిచ్చారు. ఆ రోజున రాత్రి తొమ్మిది గంటలకు లైట్లను స్విచ్ఛాఫ్ చేయాలని సూచించారు. మిగతా 2లో

## పాకిస్థాన్ ను నాలుగు ముక్కలు చేయాలి

పాకిస్థాన్ ను విచ్ఛిన్నం చేయాలన్న సుబ్రహ్మణ్యస్వామి
బలూచిస్థాన్, సింధ్, పఖ్తూనిస్థాన్ స్వతంత్ర దేశాలుగా ఏర్పడాలని వ్యాఖ్య
పశ్చిమ పంజాబ్‌ను 'బకిస్థాన్'గా పేర్కొన్న స్వామి

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 29)**

బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుబ్రమణ్యస్వామి చేసిన ఓ ట్వీట్ ప్రస్తుతం రాజకీయ, దౌత్య వర్గాల్లో తీవ్ర చర్చకు కారణమైంది. పాకిస్థాన్ ను విచ్ఛిన్నం చేసి, నాలుగు ప్రాంతాలుగా విభజించాలంటూ ఆయన చేసిన సూచన ప్రకంపనలు సృష్టిస్తోంది. "పాకిస్థాన్ ను విచ్ఛిన్నం చేయడమే మన దీర్ఘకాలిక లక్ష్యం" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. పాకిస్తాన్‌లోని బలూచిస్థాన్, మిగతా 2లో

## పహల్గాం ఉగ్రదాడి.. నేడు మోదీ అధ్యక్షతన కీలక భేటీ

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 29)**

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరుసగా కీలక భేటీలు నిర్వహిస్తోంది. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకునే క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ బుధవారం సమావేశం కానుంది. దీనికి ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షత వహించనున్నారు. ఘటన జరిగిన వెంటనే ఈ కమిటీ ఒకసారి భేటీ అయిన సంగతి తెలిసిందే. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన తొలిసారి గత బుధవారం దిల్లీలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నరమేధానికి పాల్పడిన ముష్కరులను శిక్షించడంతో పాటు వారిని ఎగదోస్తున్న శక్తులనూ బాధ్యులుగా నిలబెడతామంటూ పాకిస్థాన్‌ను గట్టిగా హెచ్చరించింది. సీమాంతర ఉగ్రవాదాన్ని వీడే వరకూ ఆ దేశంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. దౌత్య సంబంధాల మిగతా 2లో



## కాంట్రాక్ట్ ఉద్యోగులకు తీపి కబురు చెప్పిన ఏపీ ప్రభుత్వం

ఏపీలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్ ఏడాది పొడిగింపు
2026 మార్చి 30 వరకు కొనసాగింపునకు ప్రభుత్వం నిర్ణయం
ఆర్థిక శాఖ అనుమతితో నియామకం అయిన వారికే వర్తింపు

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 29)**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఊరట కల్పించే నిర్ణయం తీసుకుంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవా కాలాన్ని మరో సంవత్సరం పాటు పొడిగిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, జిల్లా కార్యాలయాల్లో పనిచేస్తున్న అనేక మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల పదవీకాలం ఈ ఏడాది మార్చి 31వ తేదీతో ముగిసింది. ఈ నేపథ్యంలో, వారి సర్వీసులను 2026 మార్చి 30వ తేదీ వరకు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ మిగతా 2లో

## పహల్గామ్ దాడికి ముందు మరో పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదుల రెక్కీ?

ఏప్రిల్ 18న బేతాబ్ వ్యాలీలో మలయాళీ పర్యాటకుడు తీసిన వీడియో
ఏప్రిల్ 22న బైసరన్ వ్యాలీలో జరిగిన ఉగ్రదాడి నిందితుల స్కెచ్‌లతో పోలికలు
వీడియో క్లిప్‌ను ఎన్ఐఏకు అందజేసిన పర్యాటకుడు
ఉగ్రవాదులు దాడికి ముందు పర్యాటక ప్రాంతాల్లో రెక్కీ చేశారనే అనుమానాలు మిగతా 2లో



## పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ ధోనీలా తయారుకావాలి

వైసీపీ జిల్లా అధ్యక్షులతో పార్టీ అధినేత వైఎస్ జగన్ సమావేశం
పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై ప్రధాన చర్చ
ప్రతిపక్షంలో చురుకైన పాత్ర పోషించాలని నేతలకు పిలుపు

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 29)**

వైసీపీ అధినేత జగన్ పార్టీ పునర్నిర్మాణంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఈరోజు పార్టీ జిల్లా అధ్యక్షులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రతిపక్షంగా సమర్థవంతంగా పని చేయాల్సిన తీరుపై ఆయన నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే నాయకుల్లో ఉండే నిజమైన నాయకత్వ ప్రతిభ బయటపడుతుందని అన్నారు. "భారీ లక్ష్యం ఉన్నప్పుడే బ్యాట్స్‌మన్ ప్రతిభ ఏంటో తెలుస్తుంది. అప్పుడే అతడు ప్రజలకు ఇష్టమైన ఆటగాడు అవుతాడు. రాజకీయాల్లో కూడా ఇది అంతే. ప్రతిపక్షంలో మనం చేసే పనుల ద్వారానే మనల్ని మనం నిరూపించుకుంటాం. ప్రజల్లో, పార్టీలో గౌరవం, ఇమేజ్ పెరుగుతాయి. మిగతా 2లో



మొదటిపేజీ తరువాయి

# పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడితే అక్కడికే వెళ్లిపోండి



ఉండి ఎదుర్కోవాలని పవన్ కల్యాణ్ అన్నారు. కశ్మీర్‌లో జరిగితే ఆ ప్రకంపనలు మనకు తగిలాయని సరిహద్దు నియంత్రణ వద్ద విధులు చాలా కష్టమని అన్నారు. ఉగ్రవాదులను ఎలాంటి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని వివరించారు.

**ఉగ్రవాదుల ఏరివేతకు ఎన్డీయే కి సహకారం**

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఉగ్రవాదుల ఏరివేతలో ప్రతి ఒక్కరూ ఎన్డీయేకు మద్దతుగా నిలవాలి. దేశంలో సహనం ఎక్కువైంది అతి సహనం మంచిది కాదు. కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉండాలి. ఇప్పటికైనా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. తప్పు జరిగినప్పుడు తప్పు అని చెప్పాలి. ముస్లింలపై వివక్ష చూపిస్తే ఇంతమంది ఇక్కడ ఎలా ఉంటారు.
శరణార్థులు దేశానికి అదనపు భారం.

# పాక్ ఎయిర్‌లైన్లకు భారత గగనతలం మూసివేత..?

కింద పాక్ రోజుకు 1,20,000 డాలర్లు వసూలుచేసింది. ఇప్పుడు ఆ మొత్తాన్ని దాయాది నష్టపోవాల్సిందే. 2019లో పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో దాదాపు 5 నెలల పాటు పాక్ తమ గగనతలంలో భారత విమానాలపై ఆంక్షలు విధించింది. దీంతో అప్పట్లో ఆ దేశం 100 మిలియన్ డాలర్ల పైగా నష్టపోయినట్లు సమాచారం.

# నేడు 'స్విచ్ఛాఫ్ లైట్స్'కు పిలుపునిచ్చిన అసదుద్దీన్ ఒవైసీ

**ఏఐఎంపీఎల్‌బీ నిరసన కార్యక్రమాలు**

వక్ఫ్ సవరణ చట్టం-2025ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) దేశవ్యాప్త ఆందోళనలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఏప్రిల్ 30న 'లైట్స్ ఆఫ్' పేరుతో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఆ రోజు రాత్రి 9 గంటలకు దేశవ్యాప్తంగా ప్రజలు తమ ఇళు, వాణిజ్య సముదాయాల్లో 15 నిమిషాల పాటు లైట్లను స్విచ్ ఆఫ్ చేసి, ఈ చట్టంపై తమ వ్యతిరేకతను శాంతియుతంగా తెలియజేయాలని బోర్డు కోరింది. ఇటీవల హైదరాబాద్‌లో మజ్లిస్ సహకారంతో 'వక్ఫ్‌ను రక్షించండి, రాజ్యాంగాన్ని కాపాడండి' పేరిట నిర్వహించిన భారీ బహిరంగ సభ విజయవంతం కావడంతో, ఆందోళనను మరింత ఉద్ధృతం చేయాలని ఏఐఎంపీఎల్‌బీ నిర్ణయించింది. ఆ సభకు వేలాది మంది ప్రజలతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, వైసీపీ, డీఎంకే సహా పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. 'వక్ఫ్ రక్షణ' పేరిట చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమం జూలై 13న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభతో ముగియనుంది. ఈ లోగా, కొత్త చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, దానిని రద్దు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పలు కార్యక్రమాలను నిర్వహించాలని ఏఐఎంపీఎల్‌బీ ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రచార కార్యక్రమాలను ఎలా నిర్వహించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై బోర్డు తమ రాష్ట్ర, జిల్లా విభాగాలకు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. అన్ని కార్యక్రమాలు క్రమశిక్షణతో, అహింసాయుతంగా జరగాలని నొక్కి చెప్పింది. "బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో, ప్రచారానికి సహకారం లభించే అవకాశం ఉండదని, కాబట్టి వీధి ప్రదర్శనలు లేదా బహిరంగ నిరసనలు నిర్వహించకూడదని నిర్ణయించుకున్నాం" అని ఏఐఎంపీఎల్‌బీ అధికార ప్రతినిధి సయ్యద్ ఖాసిం రసూల్ ఇలియాస్ తెలిపారు.

# పహల్గాం ఉగ్రదాడి.. నేడు మోదీ అధ్యక్షతన కీలక భేట

స్థాయినీ తగ్గించింది. సింధూ జలాల ఒప్పందం అమలును తక్షణమే నిలిపివేసింది. నిన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయిన సంగతి తెలిసిందే. పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది.

# కాంట్రాక్ట్ ఉద్యోగులకు తీపి కబురు చెప్పిన ఏపీ ప్రభుత్వం

అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే, ఈ సేవల పొడిగింపునకు ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిబంధనను చేర్చింది. గతంలో ఆర్థిక శాఖ ముందస్తు అనుమతితో నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులకు మాత్రమే ఈ పొడిగింపు ప్రయోజనం వర్తిస్తుందని ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నిబంధన పరిధిలోకి రాని వారికి ఈ పొడిగింపు వర్తించదు. అంతేకాకుండా, భవిష్యత్తులో కొత్తగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగులను నియమించుకోవాలంటే, తప్పనిసరిగా ముందుగా ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా కొత్త కాంట్రాక్ట్ నియామకాలు చేపట్టరాదని తెలిపింది.

## పహల్గామ్ దాడికి ముందు మరో పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదుల రెక్కీ?

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 29)**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి ఘటనకు సంబంధించి మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. దాడి జరిగిన బైసరన్ లోయకు కొద్ది రోజుల ముందు, సమీపంలోని మరో పర్యాటక ప్రాంతమైన బేతాబ్ వ్యాలీలో ఒక పర్యాటకుడు తీసిన వీడియోలో ఇద్దరు అనుమానిత వ్యక్తులు కనిపించడం కలకలం రేపుతోంది. వీరు బైసరన్ దాడి నిందితుల ఊహాచిత్రాలతో సరిపోలుతున్నట్లు గుర్తించడంతో, ఉగ్రవాదులు దాడికి ముందు కీలక పర్యాటక ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి ఉండవచ్చనే అనుమానాలు బలపడుతున్నాయి. ఈ కీలక వీడియో క్లిప్‌ను పర్యాటకుడు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అందజేశారు. పుణేలో స్థిరపడిన మలయాళీ సామాజిక కార్యకర్త శ్రేజిత్ రమేశన్, ఈ నెలలో తన కుటుంబంతో కలిసి కశ్మీర్ పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో ఏప్రిల్ 18వ తేదీన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి పహల్గామ్‌కు సుమారు 7.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బేతాబ్ వ్యాలీని సందర్శించారు. అక్కడ తన పిల్లలతో సరదాగా గడుపుతున్న దృశ్యాలను వీడియో తీశారు. అనంతరం వారి కుటుంబం శ్రీనగర్, గుల్మార్గ్‌లలో పర్యటించి తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ దాడి గురించి తెలుసుకున్న రమేశన్ బంధువులు, స్నేహితులు ఆయన క్షేమ సమాచారం కోసం ఫోన్లు చేశారు. అదే సమయంలో, దాడికి పాల్పడిన నిందితుల ఊహాచిత్రాలను అధికారులు విడుదల చేశారు. ఆ చిత్రాలను చూసిన రమేశన్‌కు అనుమానం కలిగింది. వెంటనే తన కశ్మీర్ పర్యటనలో తీసిన వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో బేతాబ్ వ్యాలీలో తీసిన వీడియోలో కనిపించిన ఇద్దరు వ్యక్తులు, విడుదలైన ఊహాచిత్రాల్లోని వారితో పోలి ఉన్నట్లు ఆయన గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన రమేశన్, జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులను సంప్రదించి, తన వద్ద ఉన్న వీడియో క్లిప్‌ను వారికి అందజేశారు. ప్రస్తుతం ఎన్ఐఏ అధికారులు ఈ వీడియోను విశ్లేషిస్తున్నారు. వీడియోలోని వ్యక్తులు, దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఒకరేనా, కాదా అనేది ఫోరెన్సిక్ దర్యాప్తు ద్వారా నిర్ధారించాల్సి ఉంది. కాగా, బేతాబ్ వ్యాలీకి, దాడి జరిగిన బైసరన్ వ్యాలీకి మధ్య దాదాపు 10 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అవసరమైనప్పుడు విచారణకు హాజరుకావాలని ఎన్ఐఏ అధికారులు తనకు సూచించారని, అలాగే ఈ విషయం గురించి మీడియాతో మాట్లాడవద్దని కూడా చెప్పినట్లు శ్రేజిత్ రమేశన్ స్థానిక పత్రికలకు తెలిపినట్లు సమాచారం.

# పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ ధోనీలా తయారుకావాలి

మన పనితీరుతోనే మన్ననలు పొందగలుగుతాం. అందరూ ధోనీలా తయారు కావాలి" అని చెప్పారు. జిల్లాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణం స్పందించి, బాధితులకు అండగా నిలవాలని జిల్లా అధ్యక్షులకు జగన్ పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక అంశాలపై గట్టిగా పోరాడాలని, పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించాలని స్పష్టం చేశారు. "మనం రాజకీయ నాయకులం. మన జీవితాలను రాజకీయాలకే అంకితం చేశామన్న విషయాన్ని మర్చిపోవద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకూడదు. ప్రతిపక్షంగా మనకు లభించిన అవకాశాలను వృథా చేసుకోకూడదు" అని సూచించారు. జిల్లా స్థాయిలో ప్రజా సంబంధిత అంశాలను సమర్థవంతంగా వెలుగులోకి తీసుకొస్తేనే ప్రజలకు మరింత చేరువ కాగలమని జగన్ అన్నారు. తిరిగి అధికారంలోకి వస్తేనే ప్రజలకు మరింత మంచి చేయగలమని, ఆ తపనతోనే రాజకీయాలు చేస్తున్నామని తెలిపారు. తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ప్రతి ఇంట్లో తన ఫోటో ఉండాలనుకున్నానని, అదే స్ఫూర్తితో జిల్లా అధ్యక్షులు కూడా తమ సేవలతో ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. పార్టీ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కూడా ఈ సందర్భంగా ఆయన జిల్లా అధ్యక్షులకు సూచించారు.

## పాకిస్థాన్ ను నాలుగు ముక్కలు చేయాలి

సింధ్, పఖ్తూనిస్థాన్ ప్రాంతాలు విడిపోయి స్వతంత్ర దేశాలుగా ఏర్పడాలని ఆయన అన్నారు. పాక్ లోని పశ్చిమ పంజాబ్ ప్రాంతాన్ని వ్యంగ్యంగా 'బకిస్థాన్' అని సంబోధిస్తూ, దానిని శత్రువుగా చూడాలని అభిప్రాయపడ్డారు. ఈ ట్వీట్ ద్వారా, పాకిస్థాన్ లోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న వేర్పాటువాద ఉద్యమాలకు స్వామి పరోక్షంగా మద్దతు ప్రకటిస్తున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా బలూచిస్థాన్, సింధ్, పఖ్తూనిస్థాన్ లలో దశాబ్దాలుగా స్వాతంత్ర్య ఆకాంక్షలు, అసంతృప్తి కొనసాగుతున్న నేపథ్యంలో స్వామి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. బలూచిస్థాన్ ప్రాంతానికి చెందిన బలోచ్ లిబరేషన్ ఆర్మీ వంటి సంస్థలు పాక్ ప్రభుత్వంతో పోరాడుతున్న విషయం తెలిసిందే. ఇదే తరహా అభిప్రాయాలను గతంలో ఇతర బీజేపీ నేతలు కూడా వ్యక్తం చేశారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఇటీవల మాట్లాడుతూ, బలూచిస్థాన్ స్వాతంత్ర్య ఉద్యమం కారణంగా పాకిస్థాన్ నుంచి విడిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే కూడా 2025 నాటికి పాకిస్తాన్ మూడు ముక్కలవుతుందని (బలూచిస్థాన్, పఖ్తూనిస్థాన్, పంజాబ్) అభిప్రాయపడ్డారు. స్వామి తాజా ట్వీట్ ఈ చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

# ప్రభుత్వ ఉద్యోగులపై వరాల జల్లు

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 29)**

ప్రభుత్వ ఉద్యోగులపై ముఖ్యమంత్రి స్టాలిన్ వరాల జల్లు కురిపించారు. శాసనసభలో సోమవారం నిబంధన 110 కింద ఆయన 9 ప్రకటనలు చేశారు. ఆయన మాట్లాడుతూ... కొవిడ్ కాలంలో ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వ ఉద్యోగులకు నిలిపివేసిన లీవ్ సరండర్ ప్రయోజనాలు మళ్లీ పొందొచ్చని, ఈ ఏడాది జనవరి 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2శాతం డీఏ పెంపు ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకూ 2శాతం డీఏను 2025 జనవరి 1 నుంచి అందించనున్నట్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అందిస్తున్న పండగ దినాల అడ్వాన్సును రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచుతున్నట్లు, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు ఉన్నత విద్యను అభ్యసించడానికి అందిస్తున్న అడ్వాన్సును ఈ ఏడాది నుంచి ఐటీఐకి రూ.లక్షగా, ఆర్ట్స్ అండ్ సైన్స్, పాలిటెక్నిక్‌కు రూ.50వేలుగా పెంచుతున్నట్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అందిస్తున్న వివాహ అడ్వాన్సును రూ.5లక్షలకు పెంచుతున్నట్లు, పింఛనుదారులకు అందిస్తున్న పండగ దినాల అడ్వాన్స్‌ను రూ.4వేలు నుంచి రూ.6వేలుకు పెంచుతున్నట్లు, ప్రభుత్వ ఉద్యోగినులకు అందిస్తున్న ఏడాది ప్రసూతి సెలవుల్లో ఇకపై ప్రొబేషనరీ కాలాన్ని పరిగణనలోకి తీసుకోనున్నట్లు ప్రకటించారు.

**డీఎంకే చర్యలే భేష్**

పోలీసుశాఖ డిమాండ్లపై చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు. డిపాజిట్లు తీసుకుని ప్రజలను మోసం చేసే సంస్థలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు అవగాహన ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. తద్వారా మోసాలు కొంతవరకు తగ్గాయన్నారు. అన్నాడీఎంకే హయాంలోని ఐదేళ్లలో రూ.97.41 కోట్లను స్వాధీనం చేసుకుని మదుపర్లకు అందించారని, డీఎంకే అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రూ.102.96 కోట్లను మదుపర్లకు తిరిగి చెల్లించిందని తెలిపారు. అన్నాడీఎంకే హయాంలో రూ.103.24 కోట్ల ఆస్తులను అటాచ్ చేయగా డీఎంకే హయాంలో రూ.319.29 కోట్ల ఆస్తులను అటాచ్ చేసినట్లు వెల్లడించారు.

కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించండి.. వానతి శీనివాసన్(భాజపా) ప్రశ్నకు ముఖ్యమంత్రి స్పందిస్తూ.. ఆడిటర్ రమేశ్ హత్య అన్నాడీఎంకే హయాంలో జరిగిందని, ఆ కేసు విచారణ కోర్టులో కొనసాగుతోందన్నారు. కశ్మీర్‌లో జరిగినట్లు తమిళనాడులో జరగదని భరోసా ఇస్తున్నానని పేర్కొన్నారు. కశ్మీర్ దుర్ఘటన తెలిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వ వైఫల్యం గురించి ప్రస్తావించలేదని, కేంద్రం చేపట్టే చర్యలకు అండగా ఉంటామని చెప్పానని గుర్తు చేశారు. భాజపా అధిష్ఠానంతో చెప్పి రాష్ట్రానికి రావాల్సిన నిధులను మంజూరు చేయించాలని కోరారు.

మాదకద్రవ్యాల నియంత్రణలో ఆదర్శం: మాదకద్రవ్యాల వ్యవహారంపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ... అన్నాడీఎంకే హయాంలో ఎక్కడ చూసినా గుట్కా, మత్తుపదార్థాలు చలామణిలో ఉన్నాయన్నారు. ఉన్నత పదవుల్లోని పోలీసులు కూడా సీబీఐ విచారణ పరిధిలోకి వచ్చారని తెలిపారు. రాష్ట్రంలో 96వేల కిలోల మత్తుపదార్థాలు స్వాధీనం చేసుకుని మత్తుపదార్థాల నియంత్రణలో దేశవ్యాప్తంగా ఆదర్శ, ఉత్తమ రాష్ట్రంగా ఉందని పేర్కొన్నారు.

**ఎం-శాండ్ ధర తగ్గింపు..:** రాష్ట్రంలో ఎంశాండ్ ధర పెరిగిందని ఓ.ఎస్.మణియన్ (అన్నాడీఎంకే) తెలియజేయగా ఆ ధరను యూనిట్కు రూ.వెయ్యి తగ్గించి విక్రయించాలని క్వారీ, క్రషర్ యజమానుల సంఘాలను ఆదేశించినట్లు మంత్రి దురైమురుగన్ తెలిపారు. ఇందుకు ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి అభ్యంతర వ్యక్తం చేశారు. యూనిట్కు రూ.1,900 వరకు పెంచగా వాటిని రూ.వెయ్యికి తగ్గించమని చెప్పడం ఆమోదయోగ్యం కాదన్నారు. ధరలు తగ్గించకుంటే కలైజ్ఞర్ గృహనిర్మాణ పథకం పేదలకు కలగానే ఉంటోందని ఓ.ఎస్.మణియన్ తెలిపారు.

కులాంతర వివాహం.. ఉద్యోగాల్లో కోటా పరిశీలన: కులాంతర వివాహం చేసుకున్నవారికి జీవో ప్రకారం జిల్లా ఉపాధికల్పన కార్యాలయాల ద్వారా అందించే ఉద్యోగాల్లో ప్రాధాన్యం కలిపించారని మంత్రి కయల్‌విళి సెల్వరాజ్ తెలిపారు. టీఎన్‌పీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యం అందించడం జీవోలో లేదన్నారు. న్యాయశాఖతో చర్చించి ఆ ఉద్యోగాలు అందించడంపై పరిశీలిస్తామని పేర్కొన్నారు.

**మహిళల భద్రత ప్రభుత్వ బాధ్యత**

రాష్ట్రంలో మహిళలకు భద్రతలేదన్న వానతి శీనివాసన్ వ్యాఖ్యలపై దురైమురుగన్ స్పందించారు. వారణాసిలో ఓ మహిళలపై 23 మంది సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. రామాయణంలోనే మహిళను అపహరించుకెళ్లారని పేర్కొన్నారు.

# లిసర్వే ప్రక్రియను పటిష్టంగా అమలు చేయాలి

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 29)**

ఆంధ్రప్రదేశ్‌లో 2019-24 మధ్య కాలంలో భారీ స్థాయిలో మద్యం కుంభకోణం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. కొన్ని ఎంపిక చేసిన సంస్థల బ్రాండ్ల మద్యం మాత్రమే అమ్ముడయ్యేలా చేసి వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డితోపాటు, కొందరు శక్తిమంతమైన నాయకులు కనీసం రూ.3,500 కోట్లు ముడుపులుగా దండుకున్నట్లు ఇప్పటి వరకు నిర్వహించిన దర్యాప్తులో తేలిందని వెల్లడించింది. మద్యం కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేలా ఆదేశించాలంటూ మిథున్‌రెడ్డి సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌లో ఈ మేరకు కౌంటర్ దాఖలు చేసింది. మద్యం అమ్మకాలను మ్యానిప్యులేట్ చేసి శక్తిమంతమైన వ్యక్తులకు లంచాలిచ్చేందుకు అంగీకరించిన కొన్ని ఎంపిక చేసిన కంపెనీల బ్రాండ్లు మాత్రమే రాష్ట్రంలో అమ్మేలా కుట్రను అమలు చేసినట్లు పేర్కొంది. ఆటోమేటెడ్ విధానాన్ని రద్దు చేసి, దాని స్థానంలో మాన్యువల్ విధానం తీసుకొచ్చి నచ్చిన సంస్థలకే పెద్ద ఎత్తున ఆర్డర్లు ఇచ్చి ముడుపులు దండుకున్నట్లు తెలిపింది. ఇందులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి కీలక భూమిక పోషించారని పేర్కొంది. ఈ కుంభకోణంలో లబ్ధి పొందినవారి వివరాలు రాబట్టేందుకు ఆయన్ను కస్టడీలో విచారించాల్సి ఉందని కోర్టుకు విన్నవించింది. కౌంటర్‌లో ప్రభుత్వం పేర్కొన్న వివరాలివీ..

మద్యం కుంభకోణంలో మిథున్‌రెడ్డి ప్రధాన పాత్రధారి. మొత్తం వ్యవహారానికి రూపకల్పన చేసి, నడిపించడంలో ఆయనే కీలకం. ఆయన, మరికొందరు నిందితులు కలిసి మొత్తం మద్యం విధానం, దాని రూపురేఖలు మార్చి.. తమతోపాటు, కావాల్సిన వారికి ముడుపులు అందేలా వ్యూహం పన్నారు. వీటిలో అత్యధికం నగదు, బంగారం రూపంలో అందుకున్నారు.

ఈ మేరకు సాక్షుల వాంగ్మూలాలు, ఆర్థిక లావాదేవీల వివరాలు, ఇతర మెటీరియల్ సేకరించాం. మిథున్‌రెడ్డితోపాటు, ఈ కుంభకోణం ద్వారా ప్రయోజనం పొందినవారిని గుర్తించడానికి, ఆర్థిక లావాదేవీలను వెలికి తీయడానికి దర్యాప్తు కొనసాగుతోంది. అందువల్ల

> మద్యం సరఫరా స్థాయి నుంచే 'మాయ'
> ఆటోమేటెడ్ సప్లైకి స్వస్తి పలికి.. మాన్యువల్ విధానం తెచ్చారు
> కనీసం రూ.3,500 కోట్లు దండుకున్నారు
> మిథున్‌రెడ్డే కుంభకోణం ప్రధాన పాత్రధారి
> సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్

పిటిషనర్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించాలి.

**ప్రభుత్వ పోర్టల్ నుంచి తప్పించి..**

2019 వరకు రాష్ట్రంలో మద్యం సేకరణ ప్రభుత్వం నిర్వహించే పోర్టల్ ద్వారా, మద్యం విక్రయాలు ప్రైవేటు దుకాణాల ద్వారా జరిగేవి. ఎంత మద్యం కావాలో సరఫరాదారులకు కంప్యూటర్ ఆధారిత ఆటోజనరేటెడ్ ఆర్డర్ ఫర్ సప్లై (ఓఎఫ్ఎస్)లు జారీ చేసేవారు. అయితే 2019 ఆగస్టు 16న రాష్ట్ర ప్రభుత్వం జీఓ నం.357 ఆధారంగా ఏపీబీసీఎల్‌కు ప్రభుత్వ రిటైల్ అవుట్‌లెట్ల ఏర్పాటుకు అవకాశం ఇచ్చింది. 2019 సెప్టెంబరు 16న ఇండియన్ రైల్ ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్‌టీఎస్) అధికారి వాసుదేవరెడ్డిని డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తీసుకొచ్చి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీగా నియమించారు. రాష్ట్రంలో మద్యం క్రయవిక్రయాలు, డిస్టిలరీలు, లేబుల్ రిజిస్ట్రేషన్లను పూర్తిగా గుప్పిట్లో ఉంచుకోవడానికి ఆయన్నే బెవరేజెస్, డిస్టిలరీస్ కమిషనర్‌గానూ నియమించారు. 2019 అక్టోబరు 18న ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేకాధికారి డి.సత్యప్రసాద్ తిరుపతిలోని నివాసంలో మిథున్‌రెడ్డిని కలిసినప్పుడు.. ఈ దందాలో తమకు సహకరిస్తే ఐఏఎస్ పదోన్నతి ప్రయోజనాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు సత్యప్రసాద్.. ఏపీఎస్‌బీసీఎల్



ద్వారా కొన్నేళ్లుగా జరిగిన మద్యం విక్రయాల వివరాలు సేకరించారు. వాటిని తీసుకొని వాసుదేవరెడ్డితో కలిసి 2019 అక్టోబరు 13న హైదరాబాద్‌లోని విజయసాయిరెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ మిథున్‌రెడ్డి, కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆయన తోడల్లుడు అవినాష్‌రెడ్డి కూడా ఉన్నారు. వారంతా కలిసి అమ్మకాల వివరాలను పరిశీలించారు. తమ ప్రణాళిక అమలు చేస్తే ప్రతి నెలా రూ.50-60 కోట్లు దండుకోవచ్చని అంచనా వేశారు.

**సీ-టెల్ సాఫ్ట్‌వేర్ రద్దు చేసి..**

రిటైల్ దుకాణాలు, డిపోలు, ఏపీఎస్‌బీసీఎల్ ప్రధాన కార్యాలయం, డిస్టిలరీలను అనుసంధానం చేయడానికి 2019 వరకు సీ-టెల్ సాఫ్ట్‌వేర్‌ను వాడేవారు. ఆ సాఫ్ట్‌వేర్ రిటైల్ దుకాణాల్లో విక్రయాలు, స్టాక్, ఏపీఎస్‌బీసీఎల్ డిపోల్లో నిల్వ అన్నీ సరిచూసుకుని ఆటోమేటిగ్గా ఓఎఫ్ఎస్‌లు జారీ చేసేది. 2019 అక్టోబరు 15న జరిగిన సమావేశంలో పన్నిన కుట్ర ప్రకారం.. ఆటోమేటెడ్ ఓఎఫ్ఎస్ జనరేషన్‌ను డిసేబుల్ చేయమని వాసుదేవరెడ్డి ఏపీఎస్‌బీసీఎల్ సీజీఎం ఆంజనేయప్రసాద్‌కు చెప్పారు. ఆయన ఆదేశాలతో డేటా బేస్ అడ్మినిస్ట్రేటర్ రామకోటేశ్వరరావు ఈ మేరకు సీ-టెల్‌కు మెయిల్ పంపారు. దాన్ని చూసిన సీ-టెల్ ప్రాజెక్టు మేనేజర్ తూము నాగేంద్ర.. ఆటోమేటెడ్ ఓఎఫ్ఎస్ జనరేషన్‌ను ఆపేస్తే మద్యం సరఫరాలో ఎదురయ్యే ఇబ్బందులను వివరిస్తూ ఏపీఎస్‌బీసీఎల్‌కు లేఖ రాశారు. మిథున్‌రెడ్డి, వాసుదేవరెడ్డి వాటిని పట్టించుకోలేదు. రాష్ట్రంలో మద్యం క్రయవిక్రయాలను తమ గుప్పిట్లో పెట్టుకోవాలన్న దురుద్దేశంతోనే ఆటోమేటిక్ విధానాన్ని తొలగింపజేశారు.

**ప్రైవేట్ మెయిల్ ఐడీ సృష్టి**

ఆ తర్వాత మద్యం కొనుగోలు ఆర్డర్లు/ ఓఎఫ్ఎస్ రిక్వెస్ట్‌ల కోసం ఒక ప్రైవేటు మెయిల్ ఐడీ సృష్టించారు. ఈ మెయిల్‌కు వచ్చిన ఆర్డర్లను వీరు మాన్యువల్‌గా పరిశీలించి, ఎంపిక చేసిన డిస్టిలరీలు/ సరఫరాదారులకే మద్యం ఆర్డర్లు ఇచ్చేలా ఓఎఫ్ఎస్‌లు జారీ చేసేందుకు మాత్రం సీ-టెల్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించారు. ఈ కొత్త విధానం ప్రారంభమైన తర్వాత సొంతంగా మద్యం తయారీ సౌకర్యాలు కూడా లేని కంపెనీలకు ఏపీఎస్‌బీసీఎల్ నుంచి పెద్ద మొత్తంలో ఓఎఫ్ఎస్‌లు జారీ అయ్యాయి. దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన బ్రాండ్లను పక్కనపెట్టేశారు.

**కేస్‌కు రూ.150 నుంచి రూ.600 వరకు ముడుపులు**

రాష్ట్రంలో ప్రతి నెలా 27-30 లక్షల కేసుల ఐఎంఎల్, 7-10 లక్షల కేసుల బీర్లు విక్రయించారు. తొలినాళ్లలో ముడుపుల గురించి సరఫరాదారులతో కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి.. తర్వాత వాసుదేవరెడ్డి మాట్లాడారు. ఆ తర్వాత అవినాష్‌రెడ్డి, అనంతరం బూనేటి చాణక్యలు హైదరాబాద్ నుంచే సరఫరాదారులు, డిస్టిలరీలతో సమన్వయం చేశారు.

సదరన్ బ్లూ, 9 హార్సెస్, ఆంధ్రా గోల్డ్, హెచ్‌డీ విస్కీలాంటి బ్రాండ్లకు కేసుకు రూ.150, దారూహౌస్, రాయల్ ప్యాలెస్, బ్రిలియంట్ బ్లెండ్‌లకు కేసుకు రూ.200, కొన్ని బ్రాండ్లకు కేసుకు రూ.350, హైఎండ్ బ్రాండ్లకు కేసుకు రూ.600 ముడుపుల కింద ఖరారు చేశారు. రెవెన్యూ శాఖ అప్పటి ముఖ్యకార్యదర్శి రజత్ భార్గవ్ జారీ చేసిన స్పెషల్ మెమో ఆధారంగా విజయసాయిరెడ్డి సిఫారసు ప్రకారం అనూష అనే డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఎంఐఎస్ సెక్షన్‌లో నియమించారు.

ఆమె రోజూ మద్యం విక్రయాల డేటా తీసుకొని తన సెల్‌ఫోన్ నుంచే విజయసాయిరెడ్డికి, సైఫ్ అనే వ్యక్తికి పంపేవారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 30.04.24 బుధవారం

## మధుసూదన్ కుటుంబానికి పవన్ ఆర్థిక సహాయం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 29)
కాశ్మీర్ ఉగ్రవాదులు దాడిలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదన్ మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. స్వయాన మధుసూదన్ అంత్యక్రియల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొని వారి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మధుసూదన్‌రావు కుటుంబానికి జనసేన పార్టీ తరఫున 50 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం మంగళవారం ప్రకటించారు. ఉగ్ర దాడిలో మధుసూదన్ రావు మరణించడం బాధాకరమైన ఆ కుటుంబానికి ఎల్లవేళలా అన్ని విధాల సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఆ కుటుంబ సభ్యులు ఏదైనా అవసరం అయితే తనను సంప్రదించవచ్చని. తెలిపారు.

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# అర్హులైన లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందించాలి

## 20 సూత్రాల అమలు ఛైర్మన్ లంకా దినకర్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)
దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పించిన వికసిత భారత్ 2047, స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రాయోజిత పథకాల లబ్ధిని అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్ కోరారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్, అధికారులతో సమావేశమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల అమలు తీరు, మౌలిక సదుపాయాలు కల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో త్రాగు, సాగు నీటి సమస్యతో పాటు ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉందని, ఫ్లోరైడ్ పీడిత జిల్లాల్లో ప్రకాశం జిల్లా ఒకటని అన్నారు. మన జిల్లాకు త్రాగు నీరు, ఫ్లోరిడ్ ప్రభావిత ప్రాంతాలలో సహాయం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానసిక పుత్రిక పి4 స్ఫూర్తితో కొన్ని కేంద్ర ప్రభుత్వ మరియు ప్రైవేట్ వ్యాపార మరియు సేవా సంస్థలను తీసుకురావడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అవసరమైన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ఫ్లోరిడ్ సమస్యకు చరమగీతం పాడితేనే వికసిత భారత్, స్వర్ణఆంధ్రలో ప్రకాశం జిల్లా భాగస్వామ్యం కాగలదని ఆయన తెలిపారు. జిల్లాలో ఉన్నటువంటి త్రాగు, సాగు నీటి సమస్యతో పాటు ఫ్లోరైడ్ సమస్య పరిస్థితులు, తీవ్రత ఏ విధంగా ఉంది, వాటి ప్రభావం ప్రజలపై ఏ విధంగా ఉంది, సహేతికంగా వివరిస్తూ, ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి స్థాయిలో నివేదిక, ప్రతిపాదనలు పంపాలని దినకర్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా జిల్లాలో వున్నటువంటి త్రాగు నీటి సమస్య పై క్షుణ్ణంగా సమీక్షించి తగు సూచనలు చేసారు. అలాగే ఫ్లోరైడ్ సమస్య ప్రభావం జిల్లాలో ఎలా వుంది, ఫ్లోరైడ్ నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య నివారణకు రక్షిత మంచి నీటి ప్లాంట్స్ ఏర్పాటుకు, డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు సామాజిక భాద్యతతో కేంద్ర, ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాపార, సేవా సంస్థలు ముందుకు వస్తున్నారని, కావున అధికారులు 2047 విజన్ ప్లాన్ ను దృష్టిలో ఉంచుకుని సంబంధిత సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి స్థాయిలో నివేదికలు సమర్పించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాల శంకరరావు, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, ఇరిగేషన్ ఎస్‌ఈ వరలక్ష్మి, పశు సంవర్ధక శాఖ జెడి డాక్టర్ బేబి రాణి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, డిఎస్‌ఓ పద్మావతి, గ్రౌండ్ వాటర్ డిడి విద్యాసాగర్, పవర్ గ్రిడ్ ప్రతినిధి ఎంఎన్ రావు, జయప్రద ఫౌండేషన్, వీనస్ ఫౌండేషన్ ప్రతినిధులు రఘురామ్, ఇండో సెల్, లారస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వే ప్రక్రియను పటిష్టంగా అమలు చేయాలి

### సిసిఎల్‌ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)
జిల్లాల్లో రీసర్వే ప్రక్రియ పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని సిసిఎల్‌ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి పేర్కొన్నారు. విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి మంగళవారం రీసర్వే, ఐవిఆర్‌ఎస్ ఫీడ్ బ్యాక్, వాటర్ ట్యాక్స్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసిఎల్‌ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎల్‌ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాల్లో రీసర్వే ప్రక్రియ పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. రీసర్వే సమస్యలు, సిటిజన్స్ సర్వీసెస్, పిజిఆర్‌ఎస్ పరిష్కారంపై దృష్టి పెట్టడం అత్యంత ముఖ్యమైనదని, ఆయా దరఖాస్తులను, సమస్యలను పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. గ్రామా స్థాయిలో వాటర్ ట్యాక్స్ వసూలు పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిజిఆర్‌ఎస్ దరఖాస్తులు బియాండ్ ఎస్‌ఎల్‌ఎలోపు వెళ్లకుండా గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫెరెన్స్‌కు ఒంగోలు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఓబులేసు, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలి

### ఏ ఒక్క గ్రామంలో తాగునీటి సమస్య ఉండకూడదు

### మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 29)
వేసవిలో తాగునీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో నీటి సరఫరా వివరాలు, సమస్యలు అధికారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. టంగుటూరు,పొన్నలూరు, జరుగుమల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో పైప్ లైన్ ద్వారా నీటి సరఫరాకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...వేసవిలో తాగునీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలి. ఏ ఒక్క గ్రామంలో త్రాగునీటి సమస్య ఉండకూడదు. నీటి సరఫరాకు ఎక్కడైనా సమస్యలు తలెత్తితే అధికారులు అందుబాటులో ఉండి వెంటనే పరిష్కరించాలి. పొలాల్లో పశువులకు నీరందించే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి అన్నారు.

## పాకిస్తానీ పౌరులకు జారీ చేసిన వీసాలు రద్దు

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)
పాకిస్తానీ పౌరులకు భారత ప్రభుత్వం జారీచేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 2025 ఏప్రిల్ 27 నుంచి రద్దుకావడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాకిస్తానీ పౌరులకు భారత ప్రభుత్వం జారీచేసిన వీసాలపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో మెడికల్ వీసాలు, లాంగ్ టర్మ్ వీసాలు, దౌత్య మరియు అధికారిక వీసాలు మినహా అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 27 ఏప్రిల్, 2025 నుంచి రద్దుకావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం పాకిస్తానీ పౌరులకు వీసా సేవలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు. పాకిస్తానీ పౌరులకు జారీ చేయబడిన మెడికల్ వీసా 29 ఏప్రిల్, 2025 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయన్నారు. పాకిస్తానీ పౌరులకు జారీ చేయబడిన దీర్ఘకాలిక వీసాలు, దౌత్య, అధికారిక వీసాలకు వర్తించదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు.

# ఆత్మకూరులో ఒకటిన ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

## ముందస్తు భాగంలోగా భద్రతా చర్యలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 29)
ఆత్మకూరులో మే 1న సీఎం పర్యటన సందర్భంగా ముందస్తు భద్రతా సమన్వయంలో (ఎఎస్ఎల్) భాగంగా సీఎం పర్యటించే ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్ పర్యటించారు. మంగళవారం ఉదయం ఆత్మకూరుకు విచ్చేసిన కలెక్టర్, ఎస్పీ ఆత్మకూరు బీసీ గురుకుల పాఠశాల వద్ద హెలీపాడ్, పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాట్లను, నారంపేట ఎంఎస్ఎంఈ పార్కు వద్ద పైలాన్ ఆవిష్కరణ, సభ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి, భద్రతాపరంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులకు కలెక్టర్, ఎస్పీ పలు సూచనలు చేశారు. నెల్లూరుపాలెం గిరిజన కాలనీ వద్ద సీఎం స్వయంగా వెళ్లి పింఛన్ అందజేసే ఇంటిని, గిరిజనకాలనీని కలెక్టర్, ఎస్పీ సందర్శించారు. మేడే కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని నారంపేట ఎస్ఎంఈ పార్క్ - నెల్లూరుపాలెం మధ్యలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం వద్ద భవన నిర్మాణ కార్మికులతో సీఎం మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకుంటారు. ఈ ప్రాంతాన్ని కూడా అధికారులు పరిశీలించారు. సీఎం పర్యటన ప్రదేశాల్లో ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క అధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆనంద్ బాధ్యతలు అప్పగించారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు సహకరిస్తూ వారి సూచనల మేరకు సీఎం పర్యటన ప్రాంతాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఎపిఐఐసి జడ్ఎం శివకుమార్, పరిశ్రమలశాఖ జిఎం మారుతీప్రసాద్, ఆర్అండ్‌బి ఎస్ఈ గంగాధర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ సీత సమేత రామచంద్రస్వామి

## నూతన విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవం






(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 29)
మండలంలోని నాగిరెడ్డిపాలెం లో కొత్తగా నిర్మించిన శ్రీ సీత సమేత రామచంద్రస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు మహాగణపతి పూజ, బుధవారం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు మంగళ హారతులు, గురువారం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట, శుక్రవారం ఉదయం 8 గంటల నుండి 1 గంటల వరకు శతవిష్ణు సహస్రనామ సూత్ర పారాయణములు, శనివారం ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం1 గంటల వరకు శ్రీ సీతారామ విగ్రహ ప్రతిష్ట మరియు ధ్వజ శికర కలస, ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో నిర్వహించుచున్నారు. కావున మండలంలోని భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామంలోని పెద్దలు కమిటీ మెంబర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.



# అత్యుత్తమ ప్రదర్శన కనపరిచిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 29)
కందుకూరు పట్టణ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన కందుకూరు శ్రీ చైతన్య హైస్కూలు రామాల వైష్ణవి (593), ద్వితీయ స్థానము సాధించిన గుర్రం ముఖేష్ (592) లను విద్యార్థులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడుతూ భవిష్యత్తులో చదివే ఉన్నత చదువులలో కూడా అత్యుత్తమ ప్రదర్శన కనపరచాలని చదువుకున్న విద్యా సంస్థలకు తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమములో చైతన్య విద్యాసంస్థల ఆర్ఐ అనిల్ కుమార్, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ బి సురేష్, డీన్ బ్రహ్మయ్య, సి బ్యాచ్ ఇంచార్జి శివయ్య, ఏఓ సురేష్ నాయుడు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.





# మేడేను అంబేద్కర్ మేడేగా జరపాలి

## కార్మిక చట్టాల రూపశిల్పి అంబేద్కర్‌కు కమ్యూనిస్టు పార్టీలు నివాళులర్పించాలి

## దళిత నేత నీలం నాగేంద్ర డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)



భారత దేశ కార్మిక చట్టాల రూప శిల్పి అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తూ మేడను అంబేద్కర్ మే డే గా జరపాలని కార్మికులకు కమ్యూనిస్టు పార్టీలను దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం మేడేను అంబేద్కర్ మేడేగా జరపాలంటూ అంబేద్కర్ కార్మికులకు చేసిన చట్టాలతో రూపొందించిన కరపత్రాలను తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బ్రిటిష్ ప్రభుత్వంలో 1942 – 1946 సంవత్సరాల మధ్య లేబర్ కమిషన్ నెంబర్ గా పని చేసిన అంబేద్కర్ ఆ సమయంలో కార్మికుల కోసం అనేక చట్టాలను పోరాడి సాధించాడన్నారు. కార్మిక వర్గానికి బ్రాహ్మణిజం, క్యాపటలిజం ఆగర్భ శత్రువులని అంబేద్కర్ ఏనాడో చెప్పాడన్నారు. సోషలిజం కలలుగనే కమ్యూనిస్టులు అంబేద్కర్ కార్మికుల కోసం చేసిన చట్టాల గురించి ఎక్కడ మాట్లాడలేదన్నారు. మార్క్స్, మావో లెనిన్ గురించి మాట్లాడే కమ్యూనిస్టులు కార్మిక చట్టాల కోసం పోరాడిన అంబేద్కర్ గురించి మాట్లాడకపోవడం అంబేద్కర్ పట్ల అస్పృశ్యత పాటించటం అన్నారు. సమ్మె కార్మికుల ప్రాథమిక హక్కు అని 1937 లోనే పోరాడిన అంబేద్కర్ను విప్లవ కమ్యూనిస్టు పార్టీలు కూడా విస్మరించడం చారిత్రక ద్రోహం అన్నారు. అమెరికాలో జరిగిన కార్మిక పోరాటం నేపథ్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం జరిపే కమ్యూనిస్టులు, ట్రేడ్ యూనియన్లు మేడే నాడు అంబేద్కర్ కార్మికుల కోసం చేసిన చట్టాల గురించి చెప్పకుండా చైనా, రష్యా విప్లవాల గురించి చెప్తారన్నారు. మనువాద బిజెపి, ఆర్ఎస్ఎస్ లు పోటీపడి అంబేద్కర్ గుర్తించి జయంతులు వర్ధంతిలు జరుపుతూ అంబేద్కర్ చట్టాలను కీర్తిస్తున్నాయన్నారు. పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యన్ మాయం అంబేద్కర్ రూపొందించిన స్టేట్ సోషలిజం అన్నారు. 1942 నవంబర్ 27 వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్లో అప్పటివరకు ఉన్న14 గంటల పని దినాన్ని ఎనిమిది గంటలకు తగ్గించిన కార్మిక వర్గ కిరీటి దారి బాబాసాహెబ్ అంబేద్కర్ మాత్రమే అన్నారు. 1923 వర్క్ మెన్ కాంపాన్ షేషన్ 2936 పేమెంట్ ఆఫ్ వేజెస్ చట్టం 1948 కనీస వేతనాల చట్టం, ఫ్యాక్టరీల చట్టం అంబేద్కర్ కార్మికులకు పోరాడి తెచ్చిన రక్షణ చట్టాలు అన్నారు. అలాగే ప్రసూతి చట్టం, కార్మిక సంఘాల గుర్తింపు చట్టం, 1944 సెలవులలోను జీతం చెల్లించే బిల్లు 1943 లో ఆరోగ్య బీమా లాంటి చట్టాలను అంబేద్కర్ ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి సాధించి తెచ్చిన కమ్యూనిస్టు పార్టీలు అంబేద్కర్ను గుర్తించలేదన్నారు. పరిశ్రమలను భూమిని జాతీయం చేసి జాతీయం చేయాలన్నా అంబేద్కర్ ఆశయానికి మద్దతుగా కార్మిక లోకం పోరాడాలన్నారు. అంబేద్కర్ చేసిన చట్టాలే భారతీయ కార్మిక వర్గ సామాజిక వర్గ పునాదిరాల్లు గ నిలిచాయన్నారు. కార్మికులతో కలిసి ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించి కార్మిక వర్గం రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకోవాలన్న దార్శనికుడు కార్మిక వర్గ పోరు బావుట అంబేద్కర్ మాత్రమే నన్నారు. అంబేద్కర్ కార్మికుల కోసం చేసిన చట్టాలను రాజ్యాంగం ద్వారా అందించిన చట్టాలను అనుభవిస్తున్న కార్మిక లోకం మేడేను అంబేద్కర్ మేడేగా జరుపుకోవాలని కమ్యూనిస్టు విప్లవ కమ్యూనిస్టులు కూడా తమ ట్రేడ్ యూనియన్ తమ పార్టీల కార్యాలయాల్లో అంబేద్కర్ ఫోటోలకు నివాళులర్పించాలని దళితనేత నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దారా అంజయ్య, కాకుమాను రవి, జనుమాల వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

# మే 2వ తేదీ ప్రధాని మోడీ సభను విజయవంతం చేద్దాం

## రాజధాని అమరావతితోనే రాష్ట్ర భవిష్యత్తు

## మూడు రాజధానుల పేరుతో మోసం చేసిన జగన్ మోహన్ రెడ్డి

## పునర్నిర్మాణ సభ విజయవంతం చేసి అమరావతికి మద్ధతు తెలుపుదాం

## విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 29)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా పాల్గొనే అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభను విజయవంతం చేద్దామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు. ప్రధాని సభను విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లకు సంబంధించి తాడేపల్లి మున్సిపాలిటీ, రూరల్, దుగ్గిరాల ప్రాంత కూటమి నేతలతో మంగళవారం నాడు తాడేపల్లి, దుగ్గిరాలల్లో మంత్రి గొట్టిపాటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నేతలకు దిశా నిర్దేశం చేసిన మంత్రి గొట్టిపాటి, సభను విజయవంతం చేయడానికి అందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. రాజధాని అమరావతితోనే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు ఆధారపడి ఉందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఒక్క అవకాశం అంటూ అధికారం చేపట్టిన జగన్ మోహన్ రెడ్డి అమరావతిని ఐదేళ్లు వెనక్కి తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానులంటూ ప్రజలందరినీ జగన్ మోసం చేశారని దుయ్యబట్టారు. అమరావతి రాజధాని పునర్నిర్మాణంతోనే ఆంధ్రప్రదేశ్ యువతకు భవిత, భవిష్యత్తుకు భరోసా అని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి పునర్నిర్మాణ బాధ్యత తీసుకున్నారని ఆయన వెల్లడించారు. రాజధానిలో కీలక ప్రాంతాలైన తాడేపల్లి మున్సిపాలిటీ, రూరల్ లతో పాటు దుగ్గిరాల ప్రాంతం నుంచి ప్రతి కుటుంబం అమరావతి పునర్నిర్మాణం సందర్భంగా మే 2వ తేదీ జరిగే ప్రధాని నరేంద్ర మోడీ సభలో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ సభను విజయవంతం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, రాజధాని అమరావతికి మద్ధతు తెలియజేయాలని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా భారీ ఎత్తున జరిగే పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనడానికి లక్షలాదిగా తరలి వచ్చే కూటమి కార్యకర్తలతో పాటు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కార్యకర్తలకు మంత్రి గొట్టిపాటి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో తణుకు ఎమ్మెల్యే రాధకృష్ణతో పాటు పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.





# కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చిన కాటమాల చెన్నకేశవరావు



(షణ్ముఖ వెలుగు కంభం ఏప్రిల్ 29)

షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు కాటమల చెన్నకేశవరావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణని కలిసి వినతిపత్రం అందజేశారు. కంభం మండలం తురిమెళ్ళ గ్రామంలో 1978 వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం అక్కడ ఉన్న పేద ఎస్సీలకు భూమి కొని 48 ప్లాట్లు మంజూరు చేయడం జరిగింది. ఆ ప్లాట్లకు పట్టాలు కూడా ఇవ్వడం జరిగింది. ఆ ప్లాట్లలో 41 నెంబర్ గల ప్లాటును కమ్యూనినల్ పర్పస్ కింద కేటాయించారు. ఆ ప్లాట్ లో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం పెట్టుకోవాలని అక్కడ ఉన్న ఎస్సీలు 2020 సంవత్సరంలో దిమ్మగట్టి అంబేద్కర్ ఫోటో పెట్టి సందర్భాన్ని బట్టి నివాళులర్పించుకొనుచున్నారు. ఈ తరుణంలో అక్కడ ఉన్న బీసీ కులానికి చెందిన చల్ల సుబ్బయ్య అక్రమంగా ఆ స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్న సందర్భంలో అక్కడ ఉన్న ఎస్సీలు అడ్డుకోవడం జరిగింది. ఆ సందర్భంలో అక్రమంగా ఎస్సీల పై కేసు పెట్టించడం జరిగింది. ఆ తర్వాత ఎస్సీలు అధికారుల కంప్లైంట్ ఇవ్వగా కంప్లైంట్ మేరకు ఎస్సీల తరఫునుంచి బాధితుల పైన కేసు నమోదు చేయడం జరిగింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఆ సమస్య కోర్టులో ఉందని తెలిసి కూడా కావాలని బీసీ కులానికి చెందిన చల్లా వెంకటమ్మ ఆమె భర్త సుబ్బయ్య, వారి అనుచరులు అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టారు. దీని పై స్పందనలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ని కలిసి ఫిర్యాదు ఇవ్వడంతో వెంటనే కంభం తాసిల్దార్‌కి జాయింట్ కలెక్టర్ ఫోన్ చేసి ఆ నిర్మాణం నిలిపివేసి సమగ్ర నివేదిక పంపించాలని ఆదేశించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో చిట్లూరు ఏలియా, డి యోబు, నేషనల్ క్రిస్టియన్ బాపట్ల ప్రకాశం జిల్లాల అధ్యక్షులు వేసి పోగు బాలు, స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్గనైజర్స్ ఆదిమానపు అనిల్ రాజులూకా ఫ్రెండ్స్ డైరెక్టర్ భరత్, కమిటీ సభ్యులు ఉన్నారు.



# వైయస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వైసీపీ జిల్లాల అధ్యక్షుల సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 29) మంగళవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన పార్టీ జిల్లాల అధ్యక్షులు సమావేశం జరిగింది. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు ఈ సమావేశానికి నెల్లూరు జిల్లా నుంచి వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి జిల్లాల అధ్యక్షులతో మాట్లాడి ఆయా జిల్లాల్లో ప్రజల ఇబ్బందులను,రాజకీయ పరిస్థితులను,పార్టీ స్థితిగతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలోపే ప్రజా వ్యతిరేకతను మూట కట్టుకుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని వైయస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లాల అధ్యక్షులకు సూచించారు. అలాగే ప్రతి విషయంలో ప్రజలకు అండగా నిలబడి త్వరితగతిన నిర్ణయాలు తీసుకొని ప్రజా సమస్యల పై ముందుండి పోరాటం చేయాలని సూచించారు. జిల్లాలో పార్టీ అధ్యక్షులే కీలకమని, పార్టీని గ్రామస్థాయి వరకు బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. జిల్లాల్లో పార్టీ గెలుపు బాధ్యత కూడా జిల్లా అధ్యక్షులదే అన్నారు. పార్టీకి సంబంధించిన అన్ని కమిటీలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలన్నారు. త్వరలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, చేపట్టి కార్యకర్తలకు మెరుగైన భీమా వర్తించే విధంగాప్రణాళిక రూపొందిస్తున్నట్లు జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.



# ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ని కలిసిన నెల్లూరు జిల్లా నాయకులు



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 29)

ఉగ్రవాద దాడిలో మరణించిన భారతీయులకు డిప్యూటి సి ఎం పవన్ కళ్యాణ్ జనసేన సంతాప సభ అనంతరం జనసేన పార్టీ మంగళగిరి కేంద్ర కార్యాలయం లో ఏపీ టిడ్కో చైర్మన్ జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ సూచనతో నెల్లూరు జిల్లా నాయకులు కలవడం జరిగింది. సంతాప సభలో ఉగ్రవాద దాడిలో మరణించిన జనసేన క్రియాశీలక సభ్యులు సోమిశెట్టి మధుసూదన్ కి జనసేన పార్టీ తరఫున ప్రమాద బీమాతో వచ్చే రూ.5 లక్షలతో సంబంధం లేకుండా రూ.50 లక్షలు పరిహారం అందిస్తామని తెలపటం జనసైనికులకు మరింత బాధ్యత నిచ్చిందని, ఈ విషయం హర్షనీయం అని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం తరఫున అందవలసిన పరిహారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా అందజేస్తారన్న సంగతి విదితమే. ఈ కార్యక్రమం జనసేన పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున యాదవ్, జనసేనపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందరరామిరెడ్డి, జిల్లా కార్యాలయం ఇన్చార్జి జమీర్, జనసేన నాయకులు బోను బోయిన ప్రసాద్, రిషికేష్ యాదవ్, కాకు మురళిరెడ్డి, వెంకట సుబ్బయ్య, జిల్లా అధికార ప్రతినిధి కారంపూడి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు రవికుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# తాతా నాగేశ్వరరావును కలిసిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 29)

విడవలూరు మండలంలోని అన్నరెడ్డిపాలెం లో నివసిస్తున్న పాత మిత్రుడు తాతా నాగేశ్వరరావును మంగళవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



# ఫ్లోరైడ్ సమస్యకు చరమగీతం పడాలి




## 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంకా దినకర్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)

జిల్లా వ్యాప్తంగా అవసరమైన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ఫ్లోరిడ్ సమస్యకు చరమగీతం పడితేనే వికసిత భారత్, స్వర్ణ ఆంధ్రలో ప్రకాశం జిల్లా భాగస్వామ్యం కాగలదని రాష్ట్ర ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మెన్ లంకా దినకర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మెన్ లంకా దినకర్ మాట్లాడుతూ త్రాగు నీరు, ఫ్లోరైడ్ సమస్య మరియు ఎర్రగొండపాలెం ఏస్పిరేషన్ బ్లాక్ లో కేంద్ర పథకాల అమలు తీరు పై జిల్లా అధికారులతో సమీక్షించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు మరియు ప్రాజెక్టులు అమలు పైన ప్రకాశం జిల్లాలో డిసెంబర్ 2024 న నా మొదటి జిల్లా సమీక్ష అధికారికంగా నిర్వహించి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 22 జిల్లాలు పూర్తి చేశామన్నారు. ప్రకాశం జిల్లాలో ఒక వైపు త్రాగు, సాగు నీరు ఇబ్బందులుంటే, పశ్చిమ ప్రకాశం జిల్లాలో ఫ్లోరిడ్ తీవ్రత ఎక్కువగా ఉందని తెలిపారు. జిల్లాలో 729 పంచాయితీల లోని 1,769 గ్రామాల్లో 1009 గ్రామాలు ఫ్లోరిడ్ సమస్యతో ఉన్నాయని, ప్రస్తుతం ఫ్లోరిడ్ సమస్యను ఎదుర్కోవడానికి మొత్తం 27 గ్రామాల్లో సురక్షిత త్రాగు నీటి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. కనిగిరి పరిధిలో అతి ఎక్కువగా 339, దర్శి పరిధిలో 120 మరియు మార్కాపురం పరిధిలో 113 గ్రామాల్లో ఫ్లోరిడ్ సమస్య తీవ్రంగా ఉంది. నీటిలో పిపిఎం 1.5 లోపు ఉండాలి, కనిగిరి పట్టణంలో అత్యధికంగా 1.98 నుండి 3.19 ఉందని, కొండపి పరిధిలోని మర్రిపూడి మండలం పరిధిలోని నర్సాపురం మరియు కొత్తూరులలో 8, 9 గా మరియు కనిగిరిలోని రేగుమనిపల్లిలో 7 గా ఉండగా, ఎర్రగొండపాలెంలో 52, కొండపిలో, ఎస్ఎన్ పాడు 25 మరియు ఒంగోలులో 1 గ్రామాలలో ఫ్లోరిడ్ సమస్య ఉందన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు గారి పీ 4 విధానం ద్వారా డయాలసిస్ సెంటర్ ను మరియు వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు ద్వారా జిల్లాలో కిడ్నీ భాదితులను ఆదుకోవడానికి సిఎస్ఆర్ నిధులను రాబట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈరోజు మన జిల్లాకు త్రాగు నీరు మరియు ఫ్లోరిడ్ ప్రభావిత ప్రాంతాలలో సహాయం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి మానసిక పుత్రిక పి4 స్ఫూర్తితో కొన్ని ప్రఖ్యాత కేంద్ర ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాపార మరియు సేవా సంస్థలను తీసుకురావడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా అవసరమైన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ఫ్లోరిడ్ సమస్యకు చరమగీతం పడితేనే వికసిత భారత్ మరియు స్వర్ణఆంధ్ర లో ప్రకాశం జిల్లా భాగస్వామ్యం కాగలదు. 16 వ ఆర్ధిక సంఘం ప్రతినిధులకు ఫ్లోరిడ్ సమస్య ఉన్న ప్రాంతాలకు అదనపు గ్రాంట్ ఇవ్వాల్సిన అవసరం తెలియజేశామన్నారు. కనిగిరి నియోజకవర్గంలో 1.70 నుండి 6.40 మధ్య పిపిఎం తో ఫ్లోరిడ్ సమస్య వల్ల అత్యధిక కిడ్నీ వ్యాధులు వస్తున్నాయి. కనిగిరి నియోజకవర్గంలో మరియు కొండపి లోని మర్రిపూడి మండలంలో " పూర్తి స్థాయిలో సురక్షిత తాగునీరు " అందించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం కనిగిరిలో ఒక డయాలిసిస్ సెంటర్ లో నెలకు 120 మందికి సేవలు అందిస్తున్నారు, ఇంకా ఎన్ని అవసరమో ప్రణాళిక సిద్ధం చేయమని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఒంగోలు నగరానికి 4 ఎంఎల్డి, మార్కాపురం 3.43, చీమకుర్తి 0.34 ఎంఎల్డి త్రాగు నీరు కొరతను అధిగమించే ప్రణాళికలు అధికారులు సిద్ధం చేశారు. 2025 - 26 వేసవిలో త్రాగు నీటి ఎద్దడి ఎదుర్కోవడానికి తక్షణ అవసరాల కోసం ఒంగోలు పట్టణానికి 4.4 కోట్లు, జిల్లాలోని మిగతా మున్సిపాల్టీలకు కలిపి 13.92 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఎర్రగొండపాలెంను నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏస్పిరేషన్ బ్లాక్‌గా గుర్తించి 6 ముఖ్యమైన సూచీలలో ప్రగతికి మార్గ నిర్దేశం చేసిందని, ఎర్రగొండపాలెంలో ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలలో గర్భిణి స్త్రీల రక్షణ కోసం రిజిస్ట్రేషన్ 91%, జనాభాలో మధుమేహం, బీపీ పరీక్షలు 81%, గర్భిణి మహిళల కోసం పోషక బలవర్ధక ఆహారం 100%, వ్యవసాయ సాయిల్ హెల్త్ శాంపిల్ సేకరణ అనంతరం కార్డుల జారీ 45% - సామాజిక అభివృద్ధిలో భాగంగా స్వయం సేవ బృందాలకు రివాల్వింగ్ ఫండ్ 60% ఫలితాలు సాధించడం జరిగిందని అధికారులు తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు ద్వారా ఏస్పిరేషన్ బ్లాక్ పనితీరును నీతి ఆయోగ్ పర్యవేక్షిస్తుందన్నారు. రాష్ట్రంలో 51 మండలాలను కరువు మండలాలుగా గుర్తించి నోటిఫికేషన్ ఇవ్వగా, అందులో 37 మండలాల్లో తీవ్ర కరువు ఏర్పడితే అందులో ప్రకాశం జిల్లాలో 11 ఉన్నాయి. రాష్ట్రంలో మిగిలిన 14 కరువు ఛాయలున్న మండలాలో ప్రకాశం జిల్లాలో 6 ఉన్నాయి. జిల్లాలో పుల్లలచెరువు, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి, కంభం, తర్లపాడు, పెద్దారవీడు, సంతనూతలపాడు, ఒంగోలు, వెలిగండ్ల మరియు బేస్తవారిపేట లలో అతి తీవ్ర కరువు ఉంది. జిల్లాలో కొనకనమిట్ల, మార్కాపురం, చీమకుర్తి, సీఎస్ పురం, పామూరు మరియు రాచర్ల మండలాల్లో కరువు ఛాయలు ఉన్నాయి. భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా భూగర్భ జలాలు చాలా లోతులో తక్కువగా ఉన్నాయి. పశ్చిమ ప్రకాశంలో భూగర్భ జలాలపైన త్రాగు, సాగు నీరు ఆధారపడి ఉన్నందున 12 మండలాల్లో 93 గ్రామాల్లో భూగర్భ జలాలు బాగా అడుగంటి పోయాయి. డోర్నాల వద్ద 63.50 మీటర్ల క్రింద భూగర్భ జలాలు ఉన్నాయి. త్రాగు నీరు కోసం భూగర్భ జలాల పైన ఆధారపడడం సురక్షితం కాదు. జల్ జీవన్ మిషన్ ద్వారా దీర్ఘకాలిక వనరుల లభ్యత ఆధారంగా ప్రతి గృహానికి సురక్షిత త్రాగు నీరు కుళాయి ద్వారా సరఫరా చేయడానికి " వెలిగొండ " పూర్తి చేయాల్సిన అవసరంను గుర్తించడం జరిగింది. వెలిగొండ పూర్తితో పశ్చిమ ప్రకాశం జిల్లా కరువుతోపాటు ఫ్లోరైడ్ సమస్య మరియు కిడ్నీ వ్యాధులు భాదితుల సమస్యను పరిష్కరించడానికి అవకాశం కలుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో 2 వ తేదీ మే 2025 న కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రధాని నరేంద్ర మోడీ గారు అమరావతిలో 1 లక్ష కోట్ల రూపాయల రాజధాని అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న సందర్భంగా ప్రజలు భారీగా తరలి వచ్చి స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. మన జిల్లాకు త్రాగు నీరు మరియు ఫ్లోరిడ్ ప్రభావిత ప్రాంతాలలో సహాయం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానసిక పుత్రిక పి4 స్ఫూర్తితో కొన్ని ప్రఖ్యాత కేంద్ర ప్రభుత్వ మరియు ప్రైవేట్ వ్యాపార, సేవా సంస్థలను తీసుకురావడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా అవసరమైన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ఫ్లోరిడ్ సమస్యకు చరమగీతం పడితేనే వికసిత భారత్, స్వర్ణఆంధ్రలో ప్రకాశం జిల్లా భాగస్వామ్యం కాగలదు. ఈ పాత్రికేయుల జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి వెంకటేశ్వరరావు, సమావేశంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోండి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)

వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా 2వ రోజు ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి పర్యవేక్షణలో పుస్తక పఠనం, స్టోరీ టెల్లింగ్, విద్యార్థినీ, విద్యార్థులచే కథలు చదివించడం, కథలు చెప్పించారు. 2వ రోజు ఈ తరగతులకు 25 మంది హాజరయ్యారు. ఈ క్లాస్లుల్లో మెడిటేషన్ - కాశీ విశ్వనాథ్, స్పోకెన్ ఇంగ్లీషు నందు గ్రామర్ వెంకయ్య, యోగ క్లాస్ టి శ్రీనివాసరావు, టి రవీంద్ర, శిరీష సృష్టి ఆర్ట్స్ అకాడమీ వారు చిత్రలేఖనం నందు పిల్లలకు ప్రకృతికి సంబంధించిన చిత్రాలు గీయటం నేర్పించారు. స్వచ్ఛందంగా శిక్షణ ఇచ్చుటకు ముందుకు రావటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరం ఉద్దేశం పిల్లలలో పుస్తక పఠనం అలవాటు చేయడం వారిలో సృజనాత్మకతను పెంపొందేలా చేయడంతో పాటు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలపై అవగాహన కల్పించడం వారితో పుస్తకాలు చదివేలా ఆసక్తిని కల్పించడం అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, వేసవి విజ్ఞాన తరగతులకు హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ కో ఛైర్మన్ గా మాంటిస్సోరి ప్రకాష్ బాబు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)

ఎపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీని పర్యవేక్షించే ఉన్నత స్థాయి రాష్ట్ర కౌన్సిల్ కు కో - ఛైర్మన్‌గా రాష్ట్ర నాయకులు మాంటిస్సోరి ప్రకాష్ బాబును కౌన్సిల్ ఛైర్మన్ కొమరగిరి చంద్రశేఖరరావు నియమించారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్య రాజు చేతుల మీదుగా మాంటిస్సోరి ప్రకాష్‌బాబు నియమకపత్రం అందుకున్నారని ఎపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు గేరా అజయ్ కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం జరిగిన ఎపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక సర్వసభ్య సమావేశంలో మాంటిస్సోరి ప్రకాష్ బాబు ను రాష్ట్ర కౌన్సిల్ కో ఛైర్మన్ గా నియామకం జరిగిందని, రాబోయే రోజులలో ప్రకాష్ బాబు నాయకత్వంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ శాఖలు సమర్ధవంతంగా పనిచేసి, అసోసియేషన్‌ను పటిష్టం చేస్తామని తెలియచేసారు. రాష్టంలోనే సీనియర్ నాయకులైన మాంటిస్సోరి ప్రకాష్‌బాబు ని ఎపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కో ఛైర్మన్ గా నియమించటం పట్ల జిల్లాలోని అసోసియేషన్ నాయకులు, ప్రైవేట్ స్కూల్స్ కరెస్పాండెంట్‌లు, స్కూల్స్ డైరెక్టర్‌లు, స్కూళ్ల ప్రిన్సిపాల్స్ హర్షం వ్యక్తం చేశారని ఎపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె శివకోటిరెడ్డి తెలిపారు. పట్టణ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అసోసియేషన్ లోని స్కూల్స్‌కు వచ్చే సమస్యలను పరిష్కరించే నాయకత్వం ఉంది కాబట్టే రాష్ట్ర కౌన్సిల్ కో ఛైర్మన్‌గా నియమింపబడ్డారని ఒంగోలు పట్టణ అధ్యక్షురాలు ఈవిఎస్ లక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు. మాంటిస్సోరి ప్రకాష్ బాబు రాష్ట్ర కౌన్సిల్ కో ఛైర్మన్ గా నియమించటం పట్ల అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షులు బొమ్మల శ్రీనివాసరావు, ఆత్మకూరి బ్రహ్మయ్య, వివి రమణ, జయ కుమార్, పిడుగు జలిరెడ్డి, జిల్లా నాయకులు ఈపూరి శివప్రసాద్, ఇండ్ల ఏసుపాదం, డ్రీమ్స్ శ్రీను, సిబి మైఖెల్, సర్ధార్, చీమకుర్తి యూనిట్ స్కూల్స్ ప్రతినిధులు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



# ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలకు వయోపరిమితి 60 ఏళ్లకు పెంచాలి

### యూనిట్ల సంఖ్య రాష్ట్రంలో ఎస్సీ జనాభా దామాషా ప్రకారం పెంచాలి

### సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా స్వామికి వినతిపత్రం అందించిన సుజన్ మాదిగ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే బ్యాంకు లింకేజీ రుణాలకు వయోపరిమితిని 60 ఏళ్లకు పెంచాలని, రాష్ట్ర మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షులు కొమ్మ సుజన్ మాదిగ మంగళవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి వెలగపూడి లోని రాష్ట్ర సచివాలయంలో ఆయన పేషీలో కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీ కార్పొరేషన్ల ద్వారా అందించే రుణాలకు 60 ఏళ్లకు వయోపరిమితి ఇవ్వటం జరిగిందని, బీసీ కులాల కన్నా కూడా సామాజికంగా, ఆర్థికంగా దిగువ భాగంలో ఉన్న ఎస్సీ కులాలకు 50 ఏళ్ల లోపు వయోపరిమితి ఇవ్వటం సరి కాదని, దీనిని పునరాలోచించి 60 ఏళ్ల వరకు వయోపరిమితి పెంచాలని మంత్రిని కోరారు. దీంతో పాటుగా జనాభా దామాషా ప్రకారం యూనిట్ల సంఖ్యను, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉపయోగపడే విధంగా యూనిట్లు ఉండేలాగా, చర్మకార వృత్తిపై ఆధారపడిన మాదిగలకు ఉపయోగపడే యూనిట్లను కూడా ఇవ్వాలన్నారు. 25 జిల్లాలలో ఎస్సీ జనాభా దామాషా ప్రకారం కార్పొరేషన్ రుణాల యూనిట్ల సంఖ్యను పెంచాలని, మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతోపాటుగా టేట్ క్వాలిఫై లేకుండా జిల్లాలోబాలికల గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న వారిని తొలగించాలని, అదేవిధంగా బాలికల గురుకులాల్లో తన ఇష్టను సారంగా అవినీతికి పాల్పడిన గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ దుడ్డు జయ పై చర్యలు చేపట్టాలని సుజన్ కోరారు. పై సమస్యల పై స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో చర్చించి, ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి ఎస్ ప్రతినిధులు గద్దే త్యాగరాజు, విజయ్, శేఖర్, బంగారం, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# కంభం చెరువుని సందర్శించిన ఎమ్మెల్యే, టూరిజం అధికారి



**కంభం చెరువుని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం**
**ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి**
**బోటులో ప్రయాణించిన ఎమ్మెల్యే**


**(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 29)**
ఆసియా ఖండంలో రెండవ అతిపెద్ద చెరువుగా ప్రసిద్ధిగాంచిన కంభం చెరువుని గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ప్రకాశం జిల్లా టూరిజం అధికారి అద్దంకి రమ్యలు కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కంభం చెరువుకి ఎంతో గొప్ప చరిత్ర ఉందని చెరువు పరిసరాలు ఎంతో సుందరమయమని ఈ చెరువు యొక్క పరిసరాలను చూపించి పర్యాటక కేంద్రంగా చేయటానికి ప్రకాశం జిల్లా టూరిజం అధికారితో కలిసి ఇక్కడికి రావడం జరిగిందన్నారు. చెరువు అందాలను పరిశీలించిన టూరిజం అధికారి రమ్య ఇక్కడి వాతావరణం, చెరువు ఆయకట్టు పరిసరాలు ఎంతో అందంగా సుందరమయంగా ఉన్నాయన్నారు. ఈ కంభం చెరువుని పర్యాటక కేంద్రంగా చేయవచ్చని చెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే నాలుగు ఐదు నెలలలో పనులు ప్రారంభించి ఇక్కడ ఏఏ వసతులు కావాలో అన్నీ సమాకూర్చి తప్పకుండా కంభం చెరువుని పర్యాటక కేంద్రంగా చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి టూరిజం అధికారితో కలిసి బోటులో ప్రయాణించి చెరువు అందాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, టీడీపీ నాయకులు, స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.







# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 29)**
1998 ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లిలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని కలసి ఉపాధ్యాయ సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మండవ సుబ్బారావు మాట్లాడుతూ మే 8వ



తేదీన జరిగే కేబినెట్ సమావేశం సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మండవ సుబ్బారావు, కొండా వెంకట శివప్రసాద్, సర్వేశ్వరరావు, ప్రభాకర్, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన ఎంపీడీవో పి సుజాత






**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 29)**
మండల కేంద్రమైన పొన్నలూరు చెరువులో మంగళవారం ఎంపీడీవో డాక్టర్ సుజాత ఉపాధి హామీ పనులను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఉపాధి కల్పించే పథకం పర్యవేక్షణ పనుల అమలు, కూలీలు సరిగా పనులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు లేదో, పనులను నాణ్యతను మరియు కూలీల హాజరు ,పనిచేసిన గంటలు ,వేతనాలు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని అలాగే వేసవికాలం కాబట్టి కూలీలందరూ ఎక్కువగా నీరు తాగాలని, పనులకు సకాలంలో వచ్చి వారి పనులు నిర్వహించుకోవాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుధాకర్, ఈసీ కోటేశ్వరరావు, టి ఏ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆదాము మరియు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# రైతులకు పంపిణీ చేసిన గొర్రులు



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 29)**
మండలంలోని వెన్నూరు గ్రామము నందు ఏపీ ఆగ్రోస్ వారి సహకారంతో వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2025-26 సంవత్సరమునకు సంబంధించి ట్రాక్టర్ వస్తువులు అయిన 9 చెక్కల గొర్రులను మంగళవారం మండల వ్యవసాయశాఖ అధికారి డి విజయకుమార్ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ బి ఎస్ఎంఏఎం 2025-26 పథకం ద్వారా ఇప్పటి వరకు కొండపి మండలానికి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం నుండి 9 చెక్కల గొర్రులను మొత్తం 19 ఇవ్వడం జరిగిందని, ఇందులో 15 జనరల్ కేటగిరీ, 4 ఎస్సీ కేటగిరీగా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా అర్హులైన రైతుల వద్ద అప్లికేషన్ తీసుకుని ఆన్‌లైన్ పద్ధతిన 50 శాతం రాయితీతో ముందుగా డబ్బులు చెల్లించిన 9 మంది రైతులకు గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రం వద్ద ఈ వస్తువులను ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపి మండల ఇంచార్జి గొర్రెపాటి రామయ్య చౌదరి, గ్రామ వ్యవసాయ సహాయకుడు జె కొండలరావు, రైతులు పాల్గొన్నారు.

# నగర పంచాయతీ కమిషనర్‌ను కలిసిన ఏఎంసీ చైర్మన్



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 29)**
పొదిలి నగర పంచాయతీ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కె ఎల్ నారాయణరెడ్డిని మంగళవారం తన కార్యాలయంలో పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇమాంసా మాట్లాడుతూ పొదిలిలోని పారిశుధ్య పనులు, ఇతర సమస్యల పై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ను కోరారు. పొదిలిలో సమస్యలు ఎక్కువ ఉన్నాయని, ముఖ్యంగా త్రాగునీటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని కమిషనర్ నారాయణరెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులతోపాటు, ఇమాంసా అభిమానులు పాల్గొన్నారు.

# కమిషనర్‌ను సత్కరించిన జనసైనికులు

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 29)**
పొదిలి నగర పంచాయతీ కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె ఎల్ నారాయణరెడ్డిని మంగళవారం తన కార్యాలయంలో జనసైనికులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు హల్చల్ జహీర్, నాగార్జున యాదవ్, మదర్ వలి, బెనర్జీ, రియాజ్, టీడీపీ నాయకులు సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



# అమరావతి రాజధాని ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుంది

**కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక, రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయి**
**ప్రజా రాజధాని పూర్తయితే యువతకు ఉద్యోగాలు ఉపాధి దొరుకుతాయి**
**1631 రోజులపాటు నిర్ధామంగా రాజధాని రైతులు పోరాటాలు చేశారు**
**న్యాయస్థానాల జోక్యంతో అమరావతి చెక్కుచెదరకుండా అలా నిలబడింది**
**ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్**

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 29)**
మే 1 వ తేదిన జిల్లాలోని ఆత్మకూరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన అధికారికంగా ఖరారు అయ్యింది. షెడ్యూల్ ప్రకారం ఉదయం11:30 కు ఆత్మకూరు లోని బాలికల గురుకుల పాఠశాల లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరు కుంటారు.అక్కడ ముఖ్యమంత్రికి ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వాగతం పలుకుతారు. అనంతరం 11:50 కు నెల్లూరుపాలెం కు చేరుకుని ఎన్ టి ఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. 12:10 నుండి 12:30 వరకు నెల్లూరుపాలెం గ్రామం లోని బిల్డింగ్ వర్కర్స్ తో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం 12:35 కు నారంపేట ఏ పి ఐ ఐ సి కు చేరుకుని యం ఎస్ యం ఈ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 1:30 నుండి 3:00 వరకు ప్రజావేదిక లో స్థానికులతో ముఖాముఖి లో పాల్గొంటారు. అనంతరం 3:05 కు టిడ్కోగ్రౌండ్ కు చేరుకుని 4:35 వరకు పార్టీ క్యాడర్ తో మాట్లాడిన అనంతరం 4:40 కు హెలిప్యాడ్ కు చేరుకుని 5:45 కు ఉండవల్లి లోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుంటారు.



# ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 29)

మహిళలు కుట్టు శిక్షణలో నైపుణ్యం పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. కందుకూరు పట్టణంలోని టిఆర్ఆర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈ డబ్ల్యూఎస్ కార్పొరేషన్ వారి సహకారంతో కందుకూరు పట్టణ, మండల మహిళల కొరకు ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు కేవలం భర్త సంపాదన పైనే ఆధారపడకుండా టైలరింగ్ నేర్చుకుని తద్వారా వచ్చే సంపాదనతో ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల పేరుతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మహిళలందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కందుకూరు పట్టణ మరియు మండల మహిళలకు ఉచిత టైలరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో శుభపరిణామమని ప్రతి మహిళ టైలరింగ్ లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన టైలరింగ్ నిపుణుల ద్వారా శిక్షణ ఇప్పించి 90 రోజుల తర్వాత ఉచితంగా కుట్టు మిషన్ పంపిణీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన కందుకూరు శాసనసభ్యులు శ్రీ ఇంటూరి నాగేశ్వరరావు గారిని టైలరింగ్ శిక్షణకు విచ్చేసిన మహిళలు ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, బిజెపి పార్టీ నాయకులు ఘట్టమనేని హరిబాబు పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, వడ్డెళ్ళ రవిచంద్ర, ముచ్చు శ్రీను, మహర్షి శ్రీను, అత్తంటి శ్రీహరి నాయుడు, గడ్డం మాలకొండయ్య, పొడపాటి మహేష్, చుండూరి శ్రీను, పువ్వాడి కోటయ్య, భవనాసి వెంకటేశ్వర్లు, షేక్ నాగూర్, గుర్రం మధు, కళ్యాణ్, మహిళా నాయకులు కల్లూరి శైలజ బత్తిన ఆదెమ్మ, కంసాని మయూరి, ఎస్తేరమ్మ మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





## కుమారి భౌతికకాయానికి నివాళులర్పించిన మాజీ మంత్రి సురేష్



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 29)

మండలంలోని చెన్నిపాడు గ్రామంలో వైసీపీ నాయకులు రాయపాటి నరసింగరావు సతీమణి కుమారి స్వర్గస్తులైనారు. గ్రామంలోని నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ మంత్రివర్యులు వైఎస్ఆర్సిపి పిఏసి సభ్యులు, కొండపి నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ కుమారి భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆయన వెంట మండలంలోని వైఎస్ఆర్సిపి నాయకులు జడ్పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు, కొండ బత్తిన మాధవరావు, పిల్లి తిరుపతిరెడ్డి, పల్నాటి వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామ నాయకులు ఉన్నారు.

## పొగాకు కిలో గరిష్ట ధర రూ.280

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 29)

మండలంలోని బాలిరెడ్డి పాలెం, జెడ్ మేకపాడు, జి మేకపాడు, కె వి పాలెం, చెన్నుపాడు, కే అగ్రహారం, కోటపాడు, ఓరుగంటి వారి పాలెం, భోగనంపాడు గ్రామాల నుంచి పొగాకు వేలం కేంద్రానికి 1175 బెల్లు తీసుకొని రాగా, 1024 బెల్లు కొనుగోలు చేశారు, 151బెల్లు తిరస్కరించారు. పొగాకు కిలో గరిష్ట ధర రూ.280 పలకగా, కనిష్ట ధర కిలో రూ.215 పలికింది. వేలం కేంద్రంలో మొత్తం 18 కంపెనీలు పాల్గొన్నాయి.

## నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 29)

జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. నూతన జడ్పీ కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈవో విద్యా రామ ఒక ప్రకటనలో మంగళవారం తెలియజేశారు. వ్యవసాయం గ్రామీణ నీటిపారుదల ఇతర శాఖలపై సమీక్ష జరుగుతోంది అని తెలిపారు. దీనికి అన్ని డిపార్ట్మెంట్లు అధికారులు సమాచారంతో రావాలని ఆమె తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షత వహిస్తుందని ఆమె పేర్కొన్నారు.

## నేడే చివరి తేదీ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 29)

జిల్లాలోని తెల్ల రేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరు ఈ కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని లబ్ధిదారులు బుధవారం చివరి తేదీ కావడంతో ఆందోళన మొదలైంది. ఈ మేరకు రేషన్ షాప్ డీలర్ల వద్దకు లబ్ధిదారులు పరుగులు తీస్తున్నారు. గడువు రేపటితో కచ్చితంగా ముగుస్తుందని కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రకటించాయి. గడువు తేదీ రేపటితో చివరి కావడంతో సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో లబ్ధిదారులు కష్టాలకు ఎదుర్కొంటున్నారు జిల్లాలోని చాలా మండలాల్లో ఇదే పరిస్థితి. కనుక కనుక పెంచాలని లబ్ధిదారు కోరుతున్నారు.

# ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ క్యాండిల్ ర్యాలీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 29)

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఏపిఈజెయు, మీడియా కెమెరామెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా మంగళవారం రాత్రి నగరంలోని ఎంసీఏ భవన్ వద్ద నుంచి చర్చి సెంటర్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. ఉగ్రవాదులు నశించాలి, భారత్ మాతాకీ జై అంటూ పెద్ద ఎత్తున నినాదలు చేశారు. ఈ సందర్భంగా ఎపిఈజెయు రాష్ట్ర అధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి, ఎంసిఏ అధ్యక్షులు వేల్పుల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అమరులైన జవాన్ల ఆత్మ శాంతి కలిగించేలా కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులు ఉరితీయాలని, పాకిస్తాన్ కి వెళ్లే సింధు జలాలను బందు చేయాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఆత్మ శాంతి కలగాలని, అలాగే గాయపడిన భారతీయులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షులు ఉబ్బా అశోక్, ఉపాధ్యక్షులు శైలజ, ఉమాయన్ భాష, ఎంసిఏ సెక్రటరీ రాజశేఖర్, జాయింట్ సెక్రెటరీ ప్రతాప్‌రెడ్డి, కోరుకొండ సుబ్బారావు, ఎంసిఏ గౌరవ అధ్యక్షులు ఇష్తీకర్ భాష, సి హెచ్ అశోక్, తిరుమలశెట్టి శ్రీను, రాయపాటి జగదీష్, చిక్కాల కిరణ్, కిషోర్, శివ, రాజు, బెల్లం అనిల్ బాబు, రవితేజ, ఆచారి, శేషు, రాఘవ, మారుతీ, కళాంజలి సుబ్బారావు, భైరపునేని శ్రీనివాసరావు, అన్వర్ భాష, పసుపులేటి సాయి, కాళేష వలి, సిహెచ్ కిషోర్, మారుతి, శివ, ఎం వి శ్రీనివాసులు, బాబు, పలువురు జర్నలిస్టు సభ్యులు పాల్గొన్నారు.










On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com